



# అమ్మపాట

— షేక్ సిరాజుద్దీన్

పోస్టాఫీసునుండి నడుచుకుంటూ ఇంటి ముఖం పట్టాను. నాలో నేనే ఏవో ఆలోచించుకొంటూ నడుస్తున్నాను.

"హలో ఎక్కడ్నుంచి" అట్నుంచి వస్తున్న నా ఫ్రెండ్ ఒకడు.

"పోస్టాఫీసు కెళ్ళి వస్తున్నానోయ్".

"విశేషాలేమిటి" అంటూ, సిన్సాపాటి రోడ్డు మీదే ఓ అయిదు నిమిషాలు చర్చించుకుని, అతని దగ్గర్నుంచి సెలవు తీసుకొని, మళ్ళీ ఇంటి వైపు నడవడం ప్రారంభించాను.

అడుగులు వడివడిగా పడుతున్నాయి.

మళ్ళీ ఊహలకందని విశేషాలేమిటో ఆలోచిస్తూ నడుస్తున్నాను.

ఇంతలో ఏదో ఆకస్మిక శక్తి నాకు తెలియకుండానే నన్నాపేసింది. ఎవరో బలవంతంగా వెనక్కు లాగుతున్నట్లుంది.

వేస్తున్న అడుగు వెనక్కి లాగుతుంటే బలాన్నంతా కూడదీసుకుని, ముందుకు అడుగువేయబోయాను. అది నావల్ల కాలేదు.

నేను నా పరిజ్ఞానంలో కొచ్చేటప్పటికి తెలిసింది. ఆ పక్కింట్లోంచి ఏదో పాట వినిపిస్తూంది.

ఆ... అవును... అదే... జోలపాట!

ప్రతి తల్లి తన శిశువు కోసం చిన్నప్పుడు ఆర్తిగా, ప్రేమతో... పాడే పాట నిజంగా అదే!

"...... ...... ......
జో అచ్యుతానందా, జోజో ముకుందా...,
లాలి పరమానందా, రామ గోవిందా...,
జో... జో...... ...... ......
...... ...... ...... ......

ఎంత తియ్యగా వుందా గొంతు!
మళ్ళీ, మళ్ళీ వినాలనిపించేలా వుంది!
ఆ శిశువు జన్మతః అదృష్టవంతుడు.
అవును, నిజంగానే అదృష్ట వంతుడు.

నా కాళ్ళు ఆ ఇంట్లోకి దారి తీశాయి. ఒక్కసారి ఆలోచించాను.

'ఆ ఇల్లు ఎవరిదీ అని'

'ఆ, అన్నయ్య స్నేహితుడు, శేఖర్ వాళ్ళ ఇల్లు'

'వాళ్ళు ఎందుకొచ్చారు అంటే ఏమని సమాధానం చెప్పాలి?'

నా మనస్సు ప్రశ్నించింది.

'శేఖర్ కోసం వచ్చామందాము'మకొని గేటు తీసుకుని లోపలికి నడిచాను.

ద్వారానికి అడ్డంగా కర్టెను వ్రేలాడుతూంది.

తలుపులు తెరిచే వున్నాయనుకొంటాను.

కర్టెనులోంచి లోపలి ఆకారాలు లీలగా కనిపిస్తున్నాయి.

'ఓ చిన్ని బాబు, ఓ బుల్లి ఉయ్యాలలో పడుకోబెట్టి వున్నట్టు నా మనస్సు ధృవపరిచింది.

జోలపాట మాత్రం అమృత వర్షంలా కురుస్తూనే వుంది.

నేను యే తెలియని తన్మయత్వంలోనో తేలిపోతున్నాను. డోర్ బెల్ నొక్కబోయాను.

'ఆ... ఆ... వద్దు' మనస్సు నాపోయింది.

'డోర్ బెల్ నొక్కితే, ఆ పాట పాడే ఆమె పాట ఆపేయ వచ్చేమోనని క్షోభిస్తూ పలికింది.

ఔనంటూ ఆ కార్యక్రమం విరమించుకుని, మెల్లగా కర్టెను తొలగించి లోపలికి తొంగి చూశాను.

ఆ మాతృమూర్తికోసం నా కళ్ళు వెదికాయి. ఆమె కన్పించలేదు. పాట మాత్రం వినిపిస్తూనే వుంది.

ఇంతలో ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారిపోయాను. నోటమాట రావడంలేదు. భూమి బద్దలైపోతున్నట్లు అనిపించింది. నా కళ్ళు నాకు కనిపించడం లేదు. కారణం నా కళ్ళకు ఆ దృశ్యానికి మధ్య నీటి పొర అడ్డుంది.

నా కళ్ళు వర్షిస్తున్నాయ్.

ఇప్పుడు నాకు జోలపాట విన్పించడంలేదు. కేవలం ఆ బాబు ఏడుపు మాత్రమే వినిపిస్తూంది.

'ఏ! ఇదేనా తల్లి ప్రేమ?'

'ఈ 'తల్లే'నా తన బాబుకోసం అమృతగానం చేస్తుందీ?'

'ఈ బాబునేనా నేను అదృష్టవంతుడిగా భావించిందీ?'

'కేవలం ఓ టేపు రికార్డరు శబ్దం వినేనా నాలోని మూగమనస్సు ఆమెను గొప్ప తల్లిగా భావించిందీ?'

'ఈ తల్లులు ఎంత సుఖ జీవులైపోయారు?'

'ఔను, నిజంగానే ఈ తల్లి తన బిడ్డపై వాస్తవిక ప్రేమను చూపించలేదు.

— కాదు, కాదు —

చూపించజాలదు' నా మనస్సు ఊరట కల్గేలా అనుకొని ఆ ఇంటి ఆవరణ నుంచి దూరంగా అడుగులు వేయసాగాను.

అక్కడ్నుంచే కాదు... అపవిత్రమైన తల్లి ప్రేమ నుంచి కూడా... అంతేకాదు... కల్మషమైన ఆ మాతృ సంస్కృతి నుండి కూడా... దూరంగా... ఇంకెంతో దూరంగా...




ఓ థియేటర్ ముందు ఇలా బోర్డు వ్రేలాడ వేశారు. "నిన్న చివరి షో తర్వాత థియేటర్‌లో 500 రూపాయిలున్న పర్సు లభించింది. ఆ పర్సు స్వంతదారు రేపు ఉదయం మేనేజర్‌గారి వద్ద లైనులో నిలబడగలరు"

-జి. రమ